
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.0
****
నల్లగొండ
5
బుధవారం 22 అక్టోబరు 2025




ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.80 (305.9818)	52,579	52,579
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	1,767.22	1,767.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.653 (43.694)	30,743	37,715

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



వైభవంగా దీపావళి



నల్లగొండ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని సోమవారం జిల్లా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుకాణాలు, ఇళ్లలో లక్ష్మీ పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించారు. పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



పోలీస్ అమరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, తదితరులు

నల్లగొండ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కీలక పాత్ర పోషిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలను రక్షించేందుకు ఎంతో మంది పోలీసులు అమరులయ్యారని, వారి త్యాగాలు మరువలేనివన్నారు. పోలీస్ అమరుల కుటుంబాలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో జిల్లాలో ఇప్పటి వరకు 15మంది అమరులయ్యారని పేర్కొన్నారు. సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు మల్లారెడ్డి, శివరాంరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాఘవరావు, రాము, మహాలక్ష్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, శ్రీనునాయక్, సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐలు సంతోష్, శ్రీను, హరిబాబు, సురప్పనాయుడు, నర్సింహ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పనులు చేసుకునే వారికి బీమా

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో తాత్కాలిక పనులు చేసుకుని జీవించే వారితో, వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు చేసుకునే వారందరితో జీవిత బీమా చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె తన ఛాంబర్‌లో మునిసిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. తాత్కాలికంగా పనులు చేసుకుని జీవించే వారికి బ్యాంకుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయన్నారు. అందుకు ఏడాదికి రూ.20 ప్రీమియంగా చెల్లిస్తే సరిపోతుందన్నారు.

'ఆది కర్మయోగి' పథకం అమలులో జిల్లాకు గుర్తింపు

ఆది కర్మయోగి పథకం అమలులో జిల్లాకు ఉత్తమ ప్రదర్శన విభాగం కింద గుర్తింపు లభించడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్‌ను ఆమె అభినందించారు.



నూనె గింజల సాగుపై కేంద్రం నజర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీ య పంట నూనెల మిషన్ నల్లగొండ జిల్లాలో అమలుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్‌ఎంఈవో (నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్) పథకాన్ని వచ్చే యాసంగి నుంచి అమలు చేయనున్నారు. అందుకు నల్లగొండ జిల్లాలో ఎనిమిది మండలాలను ఎంపిక చేశారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- ఎన్‌ఎంఈవో పంటల మిషన్ అమలు
- యాసంగిలో నల్లగొండ జిల్లాలో 8 మండలాలకు వేరుశనగ విత్తనాలు
- నూరుశాతం సబ్సిడీపై పంపిణీ
- సాగుకు సమాయాత్తం చేస్తున్న వ్యవసాయశాఖ

దేశంలో వంట నూనెల ఉత్పత్తులు తగ్గుతుండటంతో నూనె గింజల సాగుపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. నూనె గింజలను ఉత్పత్తి చేయడంతోపాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా వీటి సాగును పెంచాలని లక్ష్యంగా నిర్ణయించింది. అందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలను ఎంపిక చేసింది. అందులో భాగంగా నల్లగొండ జిల్లాలో 2,224.44 హెక్టార్ల లో వేరుశనగ సాగును ప్రోత్సహించనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూ పొందించి అందుకు అనుగుణంగా విత్తనాలను పంపిణీ చేయనుంది. ఈ మేరకు జిల్లాలో వం ట నూనె ఉత్పత్తుల సాగును పెంచేందుకు వ్య వసాయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

8మండలాల్లో ఎన్‌ఎంఈవో పథకం

జాతీయ వంట నూనెల మిషన్ పథకాన్ని ఈ ఏడాది నల్లగొండ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో అమలుచేయనున్నారు. దేవరకొండ, చందంపేట, డిండి, నేరేడుగొమ్ము, పీఏపల్లి, తిరుమలగిరి(సాగ ర్), మునుగోడు, కట్టంగూరు మండలాల్లో వచ్చే యాసంగి సీజన్ నుంచి అమలు చేయనున్నారు. నూనె గింజల ఉత్పత్తితో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడ మే లక్ష్యంగా కేంద్రం జాతీయ వంట నూనెల మిషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎన్‌ఎంఈవో పథకం కింద 2,224.44 హెక్టార్లలో నూనె గింజల పంటలు సాగుచేయనున్నారు. అందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కేంద్రం నూరుశాతం సబ్సిడీ కింద 5,004.99 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ఎంపిక చేసిన మండలాలకు సరఫరా చేసింది. అర్హులైన రైతులందరికీ వేరుశనగ విత్తనాలను నూరుశాతం సబ్సిడీతో అందించనున్నారు. వేరుశనగ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ఉచితంగా ఇవ్వనుండటంతో ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ఈ ఏడాది ఎంపిక చేసిన మండలాల్లో ఈ పథకాన్ని అమలుచేస్తుండగా, వచ్చే సీజన్ నాటికి మరింత విస్తరించే అవకాశం ఉంది.

విత్తనాలు, ఎరువుల మోతాదు ఇలా..

యాసంగిలో వేరుశనగ విత్తనాలతో పాటు విత్తన శుద్ధి, ఎరువుల మోతాదు వివరాలపై .

- మిగతా 8వ పేజీలో...

వేరుశనగ సాగుకు ప్రోత్సాహం



కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఈవో పథకాన్ని అమలు చేయడం కోసం వేరుశనగ విత్తనాలను నూరుశాతం సబ్సిడీపై అందజేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళికను ఎనిమిది మండలాల్లో అమలు చేస్తున్నాం. రైతులు దృష్టి సారించి విత్తన సాగు ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలి. ఏటా నూనె గింజల సాగును పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వేరుశనగ సాగును ప్రోత్సహిస్తోంది. రైతులు ఈ క్రమంలో వేరుశనగ సాగుపై దృష్టి సారించాలి.
- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

నూనె గింజలు సాగు చేసే మండలాల ఇలా..

మండలం	హెక్టార్లు	విత్తనాలు (క్వింటాళ్లలో)
దేవరకొండ	500	1,125
చందంపేట	500	1,125
డిండి	474.44	1,067.49
నేరడుగొమ్ము	500	1,125
పీఏపల్లి	50	112.5
తిరుమలగిరి(సాగర్)	80	180
మునుగోడు	40	90
కట్టంగూరు	80	180

కొనుగోళ్లు సజావుగా జరిగేలా కమిటీ

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్

చిట్యాలరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్రాంపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాటాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించడంలో రైతులకు ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్, మండల వ్య వసాయ అధికారి, నాయబ్ తహసీల్దార్ (సివిల్‌సప్లయ్)తో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు లేకుండా పరిష్కరిస్తుందన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, తేమ శాతం 17వరకు ఉండేలా చూడాలన్నారు. తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. 17శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతుధరను పొందాలన్నారు. వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాశులపై టార్పాలీన్లు కప్పి ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఈఓ వీణకుమారి, దంటిక రాజమల్లు, తదితరులు ఉన్నారు.

తేమ లేకుండా తీసుకురావాలి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



తొండ్లాయి కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యంలో తేమ శాతం లేకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని నెమ్మాని, తొండ్లాయి, బాజకుంట, బెండల్‌పహాడ్, అక్కెనపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కొందరు రైతులు పొలం నుంచి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. తేమ శాతం వచ్చేంతవరకు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కాగా, ఆయా కేంద్రాల్లో రికార్డుల నిర్వహణను పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం జీడికల్లు, సీసీలు శ్రీనివాసులు, నర్సింహ, శంకర్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో నేడు ప్లేస్మెంట్ డ్రైవ్

నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్, ఫ్రాంక్లిన్ టెక్ ఆధ్వర్యంలో బుధవారం ఎంజీయూలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు డైరెక్టర్ డాక్టర్ వై.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఐటీ, నాన్ ఐటీ సంస్థలు పాల్గొంటాయని, ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో పాల్గొనే అభ్యర్థులు డిగ్రీ, పీజీ, బీటెక్ పూర్తయి ఉండాలని, అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 9010203857లో సంప్రదించాలని కోరారు.



కార్తీక మాసం..
సకల శుభం
7

సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందంజ



మద్దిరాలలో శ్రీనివాస్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా నాయకులు

మద్దిరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందు వరసలో ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ ఒక్కొక్కటీగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా బాణాల శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్, నాయకులు శంకర్, మహేశ్వరం వెంకటయ్య, శివశంకర్, ఉప్పు కృష్ణయ్య, మేడిపల్లి శ్రీను, జహీర్, వీరన్న, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి ఆర్డీఆర్ కృషి

తుంగతుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ బలోపేతానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కృషి మరువలేనిదని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని ఆర్డీఆర్ నివాసంలో మంగళవారం దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పీఆర్టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, జిల్లా డివిజన్, మండల బాధ్యులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి అభినందన

తుంగతుర్తి మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జక్కి శ్రీకర్ ఇటీవల జరిగిన అండర్-14 విభాగంలో రాష్ట్రంలో కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి విద్యార్థి శ్రీకర్‌ను పూలమాలతో సన్మానించి ప్రశంసాపత్రం అందించి, అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో బోయిని లింగయ్య, ఫిజికల్ డైరెక్టర్ కొండగడుపుల యాకయ్య, ఉపాధ్యాయులు రాజన్న, సహదేవ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

మూడు గంటల్లో అడుగున్నర నీరు

- మట్టపల్లి ఆలయ ప్రాంగణంలోకి కరకట్ట లీకేజీ నీరు
- సాంకేతిక సమస్యతో నిలిచిన మోటార్లు
- పండుగ రోజు ఇబ్బంది పడ్డ భక్తులు

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలోకి కరకట్ట లీకేజీ నీరు మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు భారీవర్షాలతో పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం చేరి మట్టపల్లి ఆలయం వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 45.17టీఎంసీలు ఉండి నిండుకుండలా ఉంది. దీపావళి పండుగ రోజున కరకట్ట లీకేజీ ద్వారా ఆలయ ప్రాంగణంలోకి నీరు చేరి భక్తులు ఇబ్బందులు పడ్డారు. మూడు గంటలు మోటార్లు పనిచేయకపోవడంతో అడుగున్నర మేర ప్రాంగణంలో నీరు నిలిచింది.

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

రాష్ట్రంలో ప్రసిద్ధ నృసింహ క్షేత్రాల్లో మట్టపల్లి క్షేత్రం ఒకటి. కృష్ణానదీ తీర ప్రాంతాల్లోని పంచా నరసింహ ఆలయాల్లో ఒకటిగా మట్టపల్లి ఆలయానికి ప్రత్యేక ఉంది. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండటంతో ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. కృష్ణానది సమీపాన ఉండటం ప్రతీ ఏడాది వరద ముంపు ఇబ్బంది తప్పడం లేదు. కృష్ణానది నీరు మట్టపల్లి క్షేత్రంలోకి చేరకుండా నదీ ప్రవాహానికి ఆనుకుని ఉన్న ఆలయం చుట్టూ రూ.3 కోట్లు వెచ్చించి కరకట్ట నిర్మించారు. అయినప్పటికీ 2020లో వచ్చిన భారీ వరదలకు ఆలయ ప్రాంగణంతో పాటు గర్భగుడిలోకి నీరు చేరింది. ఆగస్టు 12 నుంచి 26 వరకు మట్టపల్లి ఆలయం వరద ముంపునకు గురికాగా నాలుగు రోజుల పాటు లక్ష్మీనరసింహుడు నీటిలో మునిగిపోగా పూజరులు, అర్చకులు మెడ వరకు ఉన్న నీటిలో గర్భగుడిలోకి వెళ్లి అర్చిత సేవలు అందించారు. భక్తులు కూడా స్వామి దర్శనానికి ఇబ్బందులుపడ్డారు. ఇటీవల భారీ వరదలు, వర్షాలకు ఆలయ ప్రాంగణంలోకి మరోసారి కరకట్ట ద్వారా లీకేజీ నీరు వచ్చి చేరుతోంది.



ఈ నెల 20న మోటార్లు పనిచేయకపోవడంతో ధ్వజస్తంభం చుట్టూ అడుగున్నర మేర నిలిచిన కరకట్ట లీకేజీ నీరు

మూడు గంటల మోటార్లు పనిచేయక...

ఇటీవల వర్షాలకు కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదనీటితో నదీ తీరంలోని పుష్కరఘాట్లు ఘాట్లు మునిగాయి. అడుగుల మేర కరకట్ట నుంచి లీకేజీ అవుతున్న నీరు ఆలయంలోకి వస్తుండగా రెండు హైస్పీడ్ మోటారు ద్వారా ఎప్పటికప్పుడు నీటిని నదిలోకి తోడుతున్నారు. ఈ నెల 20వ తేదీ దీపావళి రోజున ఉదయం 11 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచి మోటర్లు పనిచేయలేదు. సుమారు మూడు గంటల పాటు కరకట్ట లీకేజీ నీరు అడుగున్నర మేరకు ధ్వజస్తంభం వరకు చేరింది. దీంతో పండుగ రోజు ఆలయానికి వచ్చిన భక్తులు కొబ్బరికాయ కొట్టేందుకు, దర్శనాలకు తీవ్రఇబ్బందులు పడ్డారు. ఆలయం నిర్వాహకుడు మోటార్లను మార్చి నీటిని ఎత్తిపోయించారు. ప్రతీ శుక్రవారం స్వామి సన్నిధిలో సుమారు వెయ్యిం నుంచి రెండు వేల మంది భక్తులు రాత్రి నిద్రించేందుకు వస్తుంటారు. దేవాలయం వద్ద కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండగా కరకట్టకు ఐదు అడుగుల అంచులో నీరు చేరి లీకవుతోంది. రాత్రి వేళలో విద్యుత్ నిలిచినా, మోటార్లు పనిచేయకపోయినా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటుంది.

ముంపు అంచులో ఆలయం

పులిచింతల ప్రాజెక్టుకు వరద పెరుగుతుండటంతో మట్టపల్లి ఆలయం ముంపు అంచులో ఉంది. సాధారణంగా ప్రాజెక్టులో సుమారు 32 టీఎంసీ నీరు నిల్వ ఉంటే పుష్కరాల ఘాట్లు, ఆలయ మెట్లు మునిగిపోతాయి. అదే 36 టీఎంసీలు ఉంటే మట్టపల్లి ఆలయంలో కరకట్ట లీకేజీ ద్వారా ఆలయంలో వరద వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు 44టీఎంసీ నీటి నిల్వ ఉండటంతో దేవాలయం వద్ద కృష్ణమ్మ నీరు నిండుకుండను తలపిస్తోంది. కరకట్టకు సుమారు ఐదు అడుగుల అంచులో నీరుచేరి లీకేజీ అవుతోంది. దీంతో ఆలయ ప్రాగణంలో రెండు అడుగు వరకు వరద చేరుతుండటంతో ఆ నీటిని ఆలయ నిర్వాహకులు రెండు మోటర్ల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నారు. ఇప్పటికైనా మట్టపల్లి ఆలయం చుట్టూ మరో కరకట్ట నిర్మాణానికి ప్రయత్నించాలని భక్తులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామానికి చెందిన సద్దల వెంకన్న, సింగరానిపాలెం గ్రామానికి చెందిన ఒగ్గు కిరణ్‌కుమార్ అనుమతులు లేకుండా రావులపెంట గ్రామశివారులోని మూసీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానులు సద్దల వెంకన్న, ఒగ్గు కిరణ్‌కుమార్‌తో పాటు ట్రాక్టర్ డ్రైవర్ అంకెపాక ఉదయ్‌లపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● మర్రిగూడ: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లుల నల్లగొండ జిల్లా మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. యరగండ్లపల్లి గ్రామశివారులో చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామానికి చెందిన వడ్డేపల్లి శ్రవణ్ ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా మర్రిగూడ మండలం ఎర్రగండ్లపల్లికి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీన పరచుకొని శ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఇద్దరు మత్తు టాబ్లెట్ల విక్రేతల అరెస్ట్

నల్లగొండ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే ఔషధాలు(సాస్మో టాబ్లెట్స్) విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా శివరాంరెడ్డి తెలిపారు. అదేవిధంగా టాబ్లెట్స్ తీసుకుంటున్న 15 మందిపై నార్కో డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డీపీఎస్) యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని రహమాన్‌బాగ్ కాలనీకి చెందిన మహ్మద్ జబీవుల్లా ఐదేళ్లుగా ఫ్రిజ్ మెకానిక్‌గా పనిచేస్తూ మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. 2024 ఫిబ్రవరిలో రెండు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తరువాత తిరుమలగిరిలో ఒక మిల్లులో పనిలో చేరినప్పటికీ తిరిగి మూడు నెలల కిందట మత్తు టాబ్లెట్స్ కోసం వాకబ్ చేశాడు. ఈ క్రమంలోనే మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో వెంకటరమణ మెడికల్‌షాపు నిర్వాహకుడైన దారం కృష్ణసాయి ఈ టాబ్లెట్ల గురించి జబీఉల్లాకు తెలిపాడు. వీటికి సంబంధించి 8 టాబ్లెట్స్ షీట్‌ను రూ.100కు కొనుగోలు చేసి నల్లగొండ పట్టణంలో ఒక్కొక్క షీట్‌ను రూ.200కు విక్రయించి లాభం గడించవచ్చని జబీఉల్లా పథకం వేశాడు. ఈ విధంగా 10సార్లు టాబ్లెట్స్ కొనుగోలు చేసి నల్లగొండలో విక్రయించాడు. ఈ నెల 19న వెంకటరమణ వద్ద 8 బాక్స్‌లను కొనుగోలు చేసి, తన స్నేహితులైన ఐదుగురికి విక్రయించి, మిగిలిన వాటిని తీసుకొని ద్విచక్రవాహనంపై నల్లగొండకు వచ్చాడు. ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 12గంటల సమయంలో మునుగోడు రోడ్డులో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సిబ్బందితో పాటు నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో జబీఉల్లా మత్తు పదార్థాలను తీసుకొని ద్విచక్రవాహనంపై పారిపోతుండగా వెంబడించి పట్టుకుని విచారించినట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. విచారణలో మత్తు టాబ్లెట్స్ విక్రయిస్తున్నట్లు నేరం ఒప్పుకున్నాడన్నారు. వెంటనే అతడిచ్చిన సమాచారంతో వెంకటరమణ మెడికల్ షాప్ నిర్వాహకుడు దారం కృష్ణసాయిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో 15 మంది మత్తు టాబ్లెట్స్ తీసుకుంటున్నట్లు వెల్లడించినట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం జబీవుల్లాతో పాటు మత్తు టాబ్లెట్స్ తీసుకుంటున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. మెడికల్ దుకాణాన్ని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌తో సీజ్ చేయించినట్లు డీఎస్పీ తెలిపారు. సుమారు రూ.30వేల విలువైన మత్తు టాబ్లెట్‌లతో పాటు నేరస్తుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. టీజీఏఎన్‌బీ డీఎస్పీ భిక్షపతి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సతీష్, గోపాల్‌రావు, సిబ్బంది రబ్బాని, షకీల్, ఆంజనేయులు, కిరణ్, టీజీఏఎన్‌బీ సిబ్బంది నరహరి, స్వామి, డైరెక్టర్ సందీప్ సాండిల్‌యాను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత చంద్రపవార్ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

ఏఎమ్మార్పీ కాల్వలో పడి వ్యక్తి మృతి



హర్షద్(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ హెడ్‌రెగ్యులేటర్ ప్రధాన కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లిలోని ఏఎమ్మార్పీ కాల్వ వద్ద సోమవారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం వరుస సెలవులతో రావడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన సయ్యద్ హర్షద్(45) అక్కంపల్లి రిజర్వాయర్‌ను చూసేందుకు ఆదివారం స్నేహితులతో కలిసి వచ్చారు. అనంతరం ప్రధాన కాల్వ ఒడ్డున చేపలు పడుతుండగా కాలు జారి కాల్వలో పడిపోయాడు. వెంటనే తోటి స్నేహితులు బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే గుడిపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని ఆపి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం సంఘటనా స్థలానికి 200 మీటర్ల దూరంలో హర్షిద్ మృతదేహం లభ్యమైంది. దేవరకొండలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. హర్షద్‌కు భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ ..

సూర్యాపేట క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. పట్టణ పోలీసులు పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటలోని చంద్రన్నకుంటకు చెందిన షేక్ గౌస్‌బాబా-సైదాబీ(36) దంపతులు వారి కుటుంబంతో స్థానిక అయ్యప్పఎస్టేట్స్ సమీపంలోని 60 అడుగుల రోడ్డులో కొంతభూమిని అద్దెకు తీసుకుని అందులో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. గౌస్‌బాబా పట్టణంలోని పాత బస్టాండ్ పక్కన జ్యూస్ తయారుచేస్తుంటారు. వారు నివసిస్తున్న ప్రదేశంలో ఒక షెడ్డూ ఏర్పాటుచేసి అక్కడ నాటుకోళ్లను పెంచుతున్నారు. కాగా సోమవారం రాత్రి సూర్యాపేటలో కురిసిన వర్షానికి కోళ్లు ఇబ్బంది పడవద్దని భావించిన సైదాబీ కోళ్లను షెడ్డులోకి పంపించి షెడ్డుకు సంబంధించిన ఇనుప జాళీతో గేట్ పెట్టబోయింది. ఈ క్రమంలో ఇనుప జాళీకి విద్యుత్ సరఫరా జరిగి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఆమె కుమారుడు తల్లి కింద పడిపోయిన విషయాన్ని సమీపంలోని కుటుంబసభ్యులకు తెలపగా వారు వచ్చిచూసి భర్త గౌస్‌బాబాకు సమాచారమిచ్చారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భర్త గౌస్‌బాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు.

దేవరకొండలో గుర్తుతెలియని వ్యక్తి ..



గుర్తు తెలియని మృతదేహం

దేవరకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించిన ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. వారిచ్చిన సమాచారంతో సీఐ వెంకట్‌రెడ్డి బస్టాండ్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలులేవని సీఐ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. వివరాల కోసం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న గోవుల పట్టివేత

మర్రిగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం అజిలాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం కబేళాకు తరలిస్తున్న 78 గోవులను పట్టుకున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం గరికవేటితండాకు చెందిన కొంత మంది సోమవారం సాయంత్రం మర్రిగూడ నుంచి కొండూరు మీదుగా అజిలాపురం గ్రామానికి 78 గోవులను తరలిస్తునారని సమాచారం వచ్చిందన్నారు. ఆమేరకు పోలీస్ సిబ్బందితో అజిలాపురం గ్రామానికి వెళ్లి సమాచారం తెలుసుకోగా గోవులు అక్కడే ఉండగా వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. గోవులను హైదరాబాద్ తరలిస్తున్నట్లు వారికి ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. 78 గోవులను శంషాబాద్‌లోని ముచింతల్ గోశాలకు డీసీఎంలో తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గోవులను కళేబరాలకు తరలిస్తున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

మర్రిగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు నల్లగొండ జిల్లా మర్రిగూడ ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఓ ఇంట్లో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.44,625 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజాపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సోమారం గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివంరాల ప్రకారం సోమారం గ్రామానికి చెందిన మార్క నర్సింహులు ఈ నెల 19న హైదరాబాద్‌లోని కుమార్తెకు ఆపరేషన్ ఉండటంతో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. నర్సింహులు ఈ నెల 20న రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా 2 తులాల బంగారం, రూ.1500 నగదు చోరీకి గురైనట్లు గుర్తించి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమ బాణాసంచా విక్రేతపై కేసు నమోదు

అడ్డగూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు ఎస్ఐ వెంకట్ తెలిపారు. అడ్డగూడూరు మండలకేంద్రానికి చెందిన కనదుకూరి వెంకన్న తన కిరాణ దుకాణంలో అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు సమాచారంతో తనిఖీ చేయగా బాణాసంచా లభ్యమైనట్లు ఎస్ఐ తెలిపారు. రూ.4వేలు విలువైన బాణాసంచా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపాడు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దామరచర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తైక్వాండో పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ లీమామేరీ తెలిపారు. 17మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్, 10 మంది విద్యార్థులు ఎల్లో వన్ బెల్ట్, ఎనిమిది మంది గ్రీన్ బెల్ట్, ఐదుగురు గ్రీన్‌వన్ బెల్ట్, ఒకరు బ్లూ బెల్ట్, ఒకరు బ్లూ వన్, ఇద్దరు రెడ్‌బెల్ట్ మొత్తం 44మంది విద్యార్థులు బెల్ట్‌లు సాధించారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ ఎర్రవల్లి ప్రవీణ్‌కుమార్, ఎగ్జామినర్ గోలి రమేష్, కోచ్ గోలి దివ్య పాల్గొన్నారు.

కారుతో ఢీకొట్టి, కత్తితో గొంతుకోసి మహిళ హత్య

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామం నడిబొడ్డు నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను కారుతో ఢీకొట్టి కింద పడినే వెంటనే కారులో నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్)మండలం ఏపూరు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరు గ్రామానికి చెందిన కొరివి మల్లయ్యకు మోతె మండలం రాఘవపురం గ్రామానికి చెందిన భిక్షమమ్మ (40)తో 25 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లయ్య లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పెద్ద కుమారుడు భరత్ హైదరాబాద్‌లో మెకానిక్‌గా, చిన్న కుమారుడు ప్రవీణ్ సూర్యాపేట జిల్లా కేంద్రంలో చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. అయితే భిక్షమమ్మకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో భర్త మల్లయ్య, కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి సర్దిచెప్పారు. ఇటీవల సూర్యాపేటకు చెందిన దేశగురువుతో భిక్షమమ్మ చనువుగా ఉండడంతో ఆమె కుటుంబ సభ్యులు దేశగురువుతో పాటు ఆమెను మందలించారు. అయినా తీరు మార్చుకోలేదని భిక్షమమ్మను మంగళవారం భర్త మల్లయ్య పెద్దల సమక్షంలో మందలించేందుకు స్థానిక ఓ పార్టీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. పెద్దలు ఇరువురిని సముదాయించి పంపించారు. కొద్దిసేపటికే భిక్షమమ్మ(40) నడుచుకుంటూ వెళ్తుండగా, కారుతో ఢీకొట్టి అందులోంచి దిగిన గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో ఆమె గొంతుపై దారుణంగా పొడిచి హత్య చేయడంతో అధిక రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. భిక్షమమ్మ హత్యకు దారితీసిన కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, భిక్షమమ్మ(ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



శేఖర్(ఫైల్)

నార్కట్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. ఓ యువకుడు, వివాహిత మృతి చెందగా, బాధిత కుటుంబాల్లో విషాదం నెలకొంది. నార్కట్‌పల్లికి చెందిన కొత్త శేఖర్(18)తో పాటు అతడి స్నేహితుడు దుర్గం రిషికేష్‌లు ద్విచక్రవాహనంపై స్థానిక అమ్మనబోలు రోడ్డులోని పెట్రోలు బంక్ వద్దకు వెళ్లి వస్తున్నారు. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను చీకట్లో గమనించలేక వెనుక నుంచి ఢీ కొట్టారు. దీంతో తలకు బలమైన గాయాలై కొత్త శేఖర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా దుర్గం రిషికేష్ తలకు బలమైన గాయాలై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు తెలిసింది. కాగా కొత్త శేఖర్ ఢిల్లీలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి సెలవులకు ఇంటికి వచ్చి మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. శేఖర్ తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి వివాహిత



సునీత(ఫైల్)

నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామపంచాయతీ ఆవాసం వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లెర్ల సునీత(30) తన చిన్నకుమారుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదివారం రాత్రి భర్త బిక్షంతో కలిసి ద్విచక్రవాహనంపై నల్లగొండలోని ఓ ఆసుపత్రికి వెళ్లింది. తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో బాజకుంట వద్ద గొర్రెలు అడ్డువచ్చాయి. దీంతో సడెన్‌బ్రేక్ వేయగా అదుపుతప్పి ద్విచక్రవాహనంపై కూర్చున్న సునీత రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. భర్త బిక్షం ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు చక్రాల మధ్య చిక్కుకుని

మేళ్లచెర్వు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో లారీచక్రాల మధ్య చిక్కుకుని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో జరిగింది. ఎస్ఐ పరమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెల్లటూరు కాలనీకి చెందిన కల్యాణ్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై మేళ్లచెర్వు-కోదాడ ప్రధానరహదారి మీదకు వస్తున్నాడు. దారికి ఇరువైపులా కంపచెట్లు ఉండటంతో కోదాడ నుంచి మేళ్లచెర్వుకు అదేసమయంలో వస్తున్న లారీని గుర్తించలేదు. రోడ్డు మీదుకు వెళ్లే క్రమంలోనే లారీ రావడంతో ద్విచక్రవాహనంతో సహా చక్రాల కిందకు వెళ్లిపోయాడు. ద్విచక్రవాహనంతో లారీ చక్రాల మధ్య చిక్కుకుని విలవిల్లాడు. అరగంటకు పైగా స్థానికులు తీవ్రంగా శ్రమించి బయటకుతీసి మొదట కోదాడ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. కాగా ఘటనపై కల్యాణ్ తండ్రి బైరపంగు యలమంద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పరమేష్ తెలిపారు.



లారీ చక్రాల కింద చిక్కుకున్న కల్యాణ్

నాలుగు రోజుల కిందట ఆత్మహత్య

- ఇంటి నుంచి దుర్వాసనతో వెలుగులోకి

నాగార్జునసాగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఓ ఇంట్లో నుంచి వచ్చిన దుర్వాసనతో ఆత్మహత్య ఘటన వెలుగుచూసింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం సాగర్ హిల్‌కాలనీకి చెందిన పాకలపాటి కనకరాజు(45) పెయింటింగ్ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవన కొనసాగిస్తున్నాడు. అవివాహితుడు కావడం, మద్యానికి బానిసై ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. నాలుగు రోజుల కిందట ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు తెరచి చూడగా ఉరివేసుకుని వేలాడుతూ కుళ్లిన స్థితిలో అతడి మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. కనకరాజు సోదరుడు, తండ్రి ఇద్దరూ గతంలో మద్యానికి బానిసలై మృతి చెందగా చెల్లెలు పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో ఉంటోంది. కనకరాజు తల్లి కుమార్తె వద్దనే ఉంటోంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పాలకవీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం కల్మెట్టతండాలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఎస్ఐ కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం కల్మెట్టతండాకు చెందిన లావుడ్యా భోజ్యా, అతడి కుటుంబసభ్యులు, అదే గ్రామానికి చెందిన లావుడ్యా రాము, అతడి కుటుంబసభ్యులు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్తీక మాసం.. సకల శుభం

● నృసింహ క్షేత్రంలో కార్తీక వ్రతాలకు సర్వంసిద్ధం ● అందుబాటులోకి కార్తీక దీపాలు ● దంపతులతోపాటు ఇద్దరు పిల్లలకు అనుమతి


కార్తీక వేడుకలకు సిద్ధమైన నృసింహక్షేత్రం

వ్రతాలకు సిద్ధంగా ఉన్న పీటలు

యాదగిరిగుట్ట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంతోపాటు పాతగుట్ట ఆలయం సత్యదేవుని వ్రతాలకు సిద్ధమైంది. మండపాల్లో వ్రత పీటలు అందుబాటులోకి తెచ్చారు. సత్యదేవుని వ్రతాలు జరిపించుకునే భక్తులకోసం మండపాల వెలుపల అదనంగా చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు బిగించారు. వ్రతాల కార్యాలయం వద్ద తాత్కాలిక టికెట్ కౌంటర్‌కు చలువ పందిళ్లతో క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఈసారి కొత్తగా రెండు కియోస్కో యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. కార్తీక దీపాలు వెలిగించేందుకు అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయగా, టెండర్‌దారులు కొండపైన, కింద తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

నేటినుంచే కార్తీక మాసం

ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 20 వరకు 30 రోజులపాటు కార్తీక మాసం కొనసాగనుంది. 300 మంది జంటలు ఒకేసారి సామూహిక వ్రతాల్లో పాల్గొనేందుకు కొండకింద ఆధ్మాత్మిక వాడలో ప్రత్యేకంగా రెండు వ్రత మండపాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నిత్యం నిర్వహించే నాలుగు విడతలకు బదులు కార్తీక వత్రాలకు ప్రత్యేకంగా 6 (ఉదయం 7, 9, 11 గంటలు, మధ్యాహ్నం 1, 3 గంటలు సాయంత్రం 5 గంటలు) విడతలు రోటేషన్ పద్ధతిలో నిర్వహించనున్నారు. కాగా, కార్తీక పౌర్ణమి (వచ్చే నెల 5న) రోజున మాత్రం ఉదయం 5 నుంచి సాయంత్రం 7 గంటల వరకు 8 (ఉదయం 5, 7, 9, 11 గంటలు, మధ్యాహ్నం 1, 3 గంటలు, సాయంత్రం 5, 7 గంటలు) విడతలు జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్తీక పౌర్ణమి రోజున ప్రధానాలయం, శివాలయాల్లో సాయంత్రం 6.30గంటలకు ఆకాశ దీపారాధన, ప్రతి శని, ఆదివారం, కార్తీక పౌర్ణమి రోజున అదనంగా వెయ్యి మందికి అన్నదాన సదుపాయం కల్పిస్తున్నారు. వ్రత మండపాల వద్ద ఇతర భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్లు వేసి, పీటలకు రంగులు పూర్తి చేశారు. రెండు హాళ్లను నాలుగు వాక్యూమ్‌లతో శుభ్రం చేయగా, ఇప్పటికే తొమ్మిది మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి తోడు అదనంగా మరో 30మంది తాత్కాలిక సిబ్బందిని నియమించారు.

పాతగుట్ట ఆలయంలోనూ..

పాతగుట్ట అనుబంధ ఆలయంలో నిత్యం మూడు విడతల్లో నిర్వహించే వ్రతాలను కార్తీక మాసంలో 4 (ఉదయం 9, 11 గంటలు, మధ్యాహ్నం 2 గంటలు, సాయంత్రం 4 గంటలు) విడతలు, కార్తీక పౌర్ణమి (వచ్చే నెల 5న) రోజున మాత్రం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 6 (ఉదయం 7,9,11 గంటలు, మధ్యాహ్నం 1, 3 గంటలు, సాయంత్రం 5 గంటలు) విడతలు నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. అందుకు తగినట్లు ఏర్పాటు చేశారు.

కార్తీక దీపాలు వెలిగించేందుకు..

క్షేత్ర సందర్శనకు తరలివచ్చే భక్తులు కార్తీక మాసంలో కార్తీక దీపాలు వెలిగించడం ఆనవాయితీ. ఇందుకోసం దేవస్థానం రూ.37.11లక్షల పైచిలుకు టెండర్లు నిర్వహించగా, అదనంగా జీఎస్టీ కలిపి చెల్లించాల్సి ఉంది. గత ఏడాది కంటే రూ.11లక్షలు టెండరు ద్వారా ఆదాయం సమకూరింది. కాగా, కొండకింద రూ.5.49లక్షలకు, టెండరు నిర్వహించగా అదనంగా జీఎస్టీతో చెల్లించాల్సి ఉంటుంది. కొండపైన శివాలయం, ఉత్తర తిరువీధి, విష్ణుపుష్కరిణి, కొండకింద సత్యదేవుని వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, వైకుంఠద్వారం వద్ద కార్తీక దీపాలు వెలిగించేందుకు అధికారులు స్థలం సూచించగా, టెండరుదారులు తాత్కాలికంగా పందిళ్లు అందుబాటులోకి తెచ్చారు. ఇందుకు కొండపైన రూ.100, కొండ కింద రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

దంపతులు.. ఇద్దరు పిల్లలకు..

ఒక టిక్కెట్‌పై దంపతులతోపాటు ఇద్దరు పిల్లలను హాల్‌లోకి అనుమతిస్తారు. దంపతుల వెంట వచ్చిన భక్తులకోసం మండపం బయట తగిన ఏర్పాట్లు చేయగా భక్తుల సౌకరార్థం తాగునీటివసతి, ఇది వరకే ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ప్రసాదాలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. వ్రతాలు చేసుకునే భక్తులకోసం వాహన పూజల మండపంవద్ద ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించారు. ఇక్కడినుంచి బస్టాండ్లకు భక్తులను తరలించేందుకు బస్సులు అందుబాటులోకి తేనున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాల్లో సత్యదేవుని వ్రతాలు జరిపించేందుకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. కార్తీక మాసం వ్రతాలు జరిపించేందుకు సుమారు 300 పీటలు అందుబాటులో ఉంచాం. కార్తీక మాసంలో వ్రతాలు ఆరు విడతలు (పాతగుట్టలో నాలుగు), కార్తీక పౌర్ణమి రోజున (పాతగుట్టలో ఆరు) ఎనిమిది విడతలు నిర్వహించేందుకు సిద్ధం చేశాం. **రవినాయక్, ఇన్‌చార్జీ ఈవో దేవస్థానం, యాదగిరిగుట్ట**

శివకేశవులకు ప్రీతికరమైన మాసం


ముస్తాబైన జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం

సూర్యాపేటటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు పరమ పవిత్రం.. కార్తీక మాసం. ఈ మాసంలో చేసే వ్రతాలతో పుణ్యం కలుగుతుందని నమ్మకం. ఈ మాసంలో పూజలు, ఉపవాసలు, వ్రతాలు, దీపాలు వెలిగించడం ద్వారా జన్మజన్మల పాపాలు పోతాయని నమ్మకం. చాంద్ర మానం ప్రకారం కార్తీక మాసం ఎనిమిదోది. శరదృతువులో రెండోది. పూర్ణిమ నాడు చంద్రుడు కృతికా నక్షత్రం సమీపంలో సంచరిస్తూ ఉండడం వల్ల ఈ మాసానికి కార్తీకమాసం అని పేరు.

కార్తీకమాసం.. శివకేశమయం

శివకేశవులకు ప్రీతిపాత్రమైన మాసం కార్తీక. భక్త కోటి యావత్తు కఠినమైన నిష్టలతో పూజలు చేస్తారు. నెలరోజుల పాటు భక్తులు శివకేశవులకు ప్రత్యేక పూజలు చేస్తారు. శివునికి, విష్ణువులకు రుద్రాభిషేకాలు, లక్ష బిల్వ అర్చనలు, లక్ష కుంకుమార్చనలు, లలిత పారాయణాలు, విష్ణు సహస్ర నామ పారాయణం ఉదయ, సాయంత్రం వేళలో భక్తులు నిర్వహిస్తారు.

ముస్తాబైన దేవాలయాలు

సూర్యాపేట జిల్లాకేంద్రంలోని శివకేవవుల ఆలయాలు కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని అన్నపూర్ణస హిత విశ్వనాథస్వామి దేవాలయం, రామలింగేశ్వర ఆలయం, వేంకటేశ్వర ఆలయం ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

నిలకడగా మూసీ నీటిమట్టం

కేతేపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644.50 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతుంది. హైదరాబాద్ నగరంతోపాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో సాధారణ స్థితికి చేరింది. వారం పది రోజులుగా భారీగా ఉన్న ఇన్‌ఫ్లో గత రెండు రోజులుగా రెండు వేల క్యూసెక్కులకు మించడం లేదు. దీంతో ప్రాజెక్టు అధికారులు పది రోజులకు పైగా ఎత్తి ఉంచిన ఒక్కో క్రస్టు గేటును క్రమంగా మూసివేస్తూ నీటిమట్టాన్ని 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేర్చుతున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రానికి 1612.48 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి స్వల్ప పెరుగుదలతో 1767.22 క్యూసెక్కులుగా నమోదయ్యింది. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయి నుంచి తగ్గకుండా ఉంచుతున్న అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 8 నెంబరు క్రస్టుగేట్లను 2 అడుగుల మేర ఎత్తడం ద్వారా 1324.64 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు విడుదలవుతున్న మరో 390.96 క్యూసెక్కుల నీటిని కలుపుకుని ఇన్‌ఫ్లోకు సమానంగా ప్రాజెక్టు నుంచి 1,767.22 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.50 అడుగులు (4.33టీఎంసీలు)గా ఉంది.

సాగర్ నీటిమట్టం 587.80 అడుగులు

నాగార్జునసాగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 587.80 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 587.80 అడుగులుగా (305.9818టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9800 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 8,718 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,561 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్ నుంచి మొత్తం 52,579 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ఎగువ నుంచి 52,579 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది.

కురిసిన వర్షం.. దెబ్బతిన్న పంటలు





కోదాడ మండలంలో కురిసిన వర్షానికి నేలవాలిన వరిపైరు, నాగారం మండలం ఫణిగిరి కేంద్రంలో తడిసిన ధాన్యం

కోదాడ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షాలతో రామలక్ష్మీపురం, యర్రవరం, గణపవరం, తొగర్రాయి, కాపుగల్లు, గుడిబండ గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరిపంట నేలవాలింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో 15 రోజుల్లో పంట చేతికొస్తుందన్న ఆశతో ఉన్న రైతులకు నిరాశే ఎదురైంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

తుంగతుర్తి: మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి వచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా, తడిసి ముద్దకావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి వరి పంట చాలా ప్రాంతాలలో నేలకొరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంటాలు అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నాగారం: మండలంలో కురిసిన భారీ వర్షానికి ఐకేపి కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసింది. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములతో కురిసిన వర్షానికి ఫణిగిరి ఐకేపీ కేంద్రంలో ధాన్యం ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో మహిళలకు చీరల పంపిణీ

రామన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే సమభావన సంఘాల్లోని మహిళలందరికీ చీరలు పంపిణీ చేయనున్నామని డీఆర్డీవో నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గోదాములో ఉన్న చీరలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అన్ని మండలాలకు చీరలు చేరుకున్నాయని, మరి కొన్ని చీరలు రావాల్సి ఉందన్నారు. జిల్లాలో 17,950 సంఘాలు ఉన్నాయని, అందులో 1,91,600 మంది సభ్యులున్నారని చెప్పారు. మహిళలందరికీ ఒకే రకమైన చీరలను ఒక్కొక్కరికి రెండు చొప్పున అందజేయనున్నామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం మార్కెట్‌లోని ధాన్యాన్ని పరిశీలించారు. వర్ష సూచనలు కనిపిస్తున్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీలు గోగు వెంకటేశ్వర్లు, ఆవనగంటి నరసింహ, డీపీఎం కట్ట వెంకటేశ్వర్లు, సంఘం బంధం నాయకురాళ్లు రేణుక, అనిత తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్‌ఆర్ నిర్వాసితుల నామినేషన్ దాఖలు


నామినేషన్ వేసేందుకు వెళుతున్న రామ్‌గౌడ్

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నట్లు త్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దబ్బేటి రామ్ గౌడ్ తెలిపారు. రామ్ గౌడ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన దబ్బేటి రామ్ గౌడ్ తనకు ఉన్న మూడు ఎకరాల వ్యవసాయ భూమి త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌లో కోల్పోతున్నాడు. దీంతో ప్రభుత్వంపై సాగిస్తున్న పోరాటంలో భాగంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలన్న లక్ష్యంతో రామ్ గౌడ్ షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. పోలీసులు, అధికారులు అనేక అడ్డంకులు సృష్టించినా కూడా భయపడకుండా నామినేషన్ దాఖలు చేసినట్లు రామ్ గౌడ్ తెలిపారు. త్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని లేదా బహిరంగ మార్కెట్ విలువకు రెండింతలు అదనంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఉద్దేశ్యంతోనే భూ నిర్వాసితులు నామినేషన్లను దాఖలు చేశారని ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 36 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కరాటేలో మూడు నెలలు శిక్షణ ఇచ్చేందుకు బ్లాక్ బెల్ అర్హత, అనుభవపత్రం కలిగిన కరాటే శిక్షకులు పూర్తి బయోడేటాతో ఈ నెల 24వ తేదీ వరకు డీవైఎస్‌వో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని డీవైఎస్‌వో అక్బర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన శిక్షకులకు ప్రతీ నెల 10 వేల చొప్పున పారితోషికం చెల్లించనున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన వారై ఉండాలని, ఎంపిక కరాటే శిక్షకులు వారంలో 6 రోజులు, నెలకు 24 రోజులు బాలికలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఆకట్టుకునే ఆకాశం.. అందమైన కోవెల



నల్లటి మబ్బులను చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూరీడి స్వర్ణవర్ణపు కాంతులీనుతుంటే... ఆ వెలుగుల్లో కన్పిస్తున్న కోవెల... ఈ అద్భుత చిత్రం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానం గుట్టపై ఆవిష్కృతమైంది. గుట్టపై ఉన్న పార్వతీ రామలింగేశ్వర స్వామి కోవెల వద్ద కన్పించిందీ సుందర దృశ్యం.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

ఆకాశన్నంటే భవనాలు



నీలాకాశం కింద నిశ్శబ్దంగా నిలబడి ఉన్న ఈ గగనతలాలు బీబీనగర్ పట్టణానికి నగర శోభను తీసుకొచ్చాయి. నీటి అంచున ఎత్తయిన ఎయిమ్స్ భవన సముదాయాల సమాహం.. మనిషి కళలు ఎంత ఎత్తుకు వెళ్లగలవో చూపిస్తున్న ఈ దృశ్యం ఆధునికతకు అద్దంపడుతోంది.

(ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

30 కిలోల మీనం



నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మత్స్యకారులకు భారీ చేప వలకు చిక్కింది. రోజు మాదిరిగానే మత్స్యకారుడు కూరాకుల చిన్న ముత్యాలు చేపలు పట్టడానికి ఏకేబీఆర్ రిజర్వాయర్‌లో వలవేశాడు. వలకు భారీ చేప చిక్కడంతో వల ఎంత లాగినా రాకపోవడంతో తోటి మత్స్యకారుల సహాయంతో వలను లాగేయాగా 30 కిలోల భారీ బొచ్చ చేప వలకు చిక్కింది. రూ.6000కు స్థానికులకు విక్రయించినట్లు మత్స్యకారుడు తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)

జాతీయ పోటీలకు ఎంపిక

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి రమావత్ గణేష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటయ్య మంగళవారం తెలిపారు. మెదక్ జిల్లా పఠాన్ చెరువులో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్-14 కబడ్డీ విభాగంలో జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు..

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డీఏవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పవన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో అభిప్రీతి, దీక్షిత, సాహితీ, శ్రీవర్షిత, బాలుర విభాగంలో సాత్విక్, అభిషేక్, నవనీత్, అండర్-17 బాలుర విభాగంలో రవిచంద్ర, సాజిద్, రాఘవేంద్ర , మౌనిక ఎంపికైనట్లు వివరించారు.

రామన్నపేట: గో సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్షల్లో స్థానిక వివేకానందాస్ స్కూల్‌కు చెందిన సీహెచ్ హర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ తిరుగుడు మల్లికార్జున్ తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు


ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సిందూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్ర నామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణపర్వాలను పాంచ రాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్ర హవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,13,145 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కాగా, తెలంగాణ టీడీపీ నేత జయరాం చందర్ దంపతులు స్వామివారిని దర్శించుకొని స్వయంభువులకు ప్రత్యేకపూజలు చేశారు. మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అంతకు ముందు సుదర్శ నారసింహ హోమం, పుష్పార్చనలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయంలో దీపావళి వేడుకలు

స్వామివారి ఆలయంలో దీపావళి పండగ రోజు సోమవారం ఉదయం, సాయంత్ర ప్రత్యేక కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. ఉదయం మంగళశాసనం అందజేసి హారతి నివేదించి ప్రత్యేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా నిత్య పూజలు, అభిషేకం, ఆరాధనలు, సాయంత్రం ఆలయ ముఖ మండపంలో అమ్మవారికి ధనలక్ష్మి పూజలు జరిపి మహాలక్ష్మి అనుగ్రహం భక్తులపై ఉండాలని అధికారులు, పూజారులు బాణాసంచా కాల్చారు. ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు జీ. వీరారెడ్డి, ఏ. భాస్కర్‌రావు, ఆలయ ఏఈవో గజ్వెల్లి రఘు, పర్యవేక్షకుడు కలకోట సీతరామాచార్యులు, రికార్డు అసిస్టెంట్ సుదగాని చంద్రమౌళి, ఆలయ ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు, ఉప ప్రధానాచార్యుడు వజ్జల లక్ష్మణాచార్యులు బృందం పాల్గొన్నారు.

నేడు గిరిప్రదక్షిణ

యాదగిరిగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట, పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి స్వాతి నక్షత్రం సందర్భంగా ఉభయ ఆలయాల్లో వేకువజామున వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ పూజారులు అష్టోత్తరశతకటాభిషేకం వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకల సందర్భంగా యాదగిరి' ప్రదక్షిణ చేపట్టనున్నారు. వైకుంఠద్వారం వద్ద తెల్లవారుజామున 5.30గంటలకు ఆలయ పూజారుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించనుండగా భక్తులు పాల్గొననున్నారు.

హక్కుల కోసం గీత కార్మికులు పోరాడాలి

చిట్యాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం గీత కార్మికులు ఐక్యంగా పోరాడాలని గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు అన్నారు. సంఘం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం చిట్యాలలో సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. గీత కార్మికుల కోసం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, కూనూరు అంజయ్య, కూనూరు మారయ్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శాలిగౌరారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కకొండారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన అరిగే అంజయ్య కుటుంబానికి ఎమ్మెల్యే మందుల సామేల్ పంపిన రూ.5వేలు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అందజేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యంతో నిండిన రోడ్లు

ఆరబోసిన ధాన్యంతో రాకపోకలకు ఇబ్బందులు



ఉప్పలపహాడ్ వద్ద రోడ్డునిండా ధాన్యం ఆరబోసి అడ్డుపెట్టిన రాళ్ళు

కేతేపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అనేక కష్టనష్టాలకు ఓర్చి మండల రైతాంగం పండించిన వానాకాలం వరి పంట ప్రస్తుతం చేతికి వస్తుంది. ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలు, ఏఎమ్మార్పీ, మూసీ కాల్వలకు సాగునీటి విడుదలతో ఆయకట్టు గ్రామాల్లో, వ్యవసాయ బావులు, బోర్ల సాయంతో ఆయకట్టేతర గ్రామాల్లో రైతాంగం వానాకాల సీజన్‌లో 21 వేల పైచిలుకు ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం వానాకాలం వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు పంట కోతకోసిన ధాన్యం నేరుగా అమ్ముకునే వీలులేకపోవడం, ఆరబోసుకోవడానికి సరైన కల్లాలు లేకపోవడంతో గ్రామాల్లోని రోడ్లపై ధాన్యం ఆరబోసుకుంటున్నారు. దీంతో మండలంలోని గ్రామీణ రహదారులతో పాటు 65వ నెంబరు జాతీయ రహదారి వెంట గల కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల్లో హైవేకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లు ధాన్యంతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా కొందరు రైతులు గ్రామీణ రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగేలా రోడ్డు నిండా ధాన్యం ఆరబోస్తున్నారు. ధాన్యం మీదకు వాహనాలు రాకుండా ఉండేందుకు పెడుతున్న పెద్ద పెద్ద రాళ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే హైవే వెంట గల గ్రామాల్లో సర్వీసు రోడ్లు మొదలయ్యే చోట, ముగించే చోట పలువురు రైతులు హైవేను ఆక్రమించి ధాన్యం పోస్తున్నారు. దీంతో ఆయా రహదారులపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవేపై ప్రయాణించే ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు రోడ్డు చివర్లోకి వస్తే ప్రమాదం బారిన పడే పరిస్థితులు ఉన్నాయి.

పగలే వెన్నెల

నియంత్రణ కరువాయే.. నిరంతర వెలుగాయే..



షాదీఖానా పక్కన వీధిలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

మునుగోడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలోని వివిధ గ్రామాల్లో పగటి సమయంలో వీధి దీపాలు వెలుగుతున్నాయి. నిర్వహణ లోపాలను సరిచేయటంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అధికారుల పర్యవేక్షణ లోపాల కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. నిరంతరం పగలే వెన్నెల తరహాలో వెలుగులాయే.. నియంత్రణ కరవాయే అన్న చందంగా సమస్య మారిందన్న విమర్శలు వస్తున్నాయి. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వెరసి రాత్రి సమయంలో వెలుగులు ఇవ్వాల్సిన వీధి దీపాలు పగటి సమయంలో సైతం వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఈ సమస్య మండలంలోని అన్ని గ్రామాల్లో ఉందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో కొన్ని వీధి దీపాలను ఆన్‌ఆఫ్ విధానం లేకపోవడంతో నిరంతరం వెలుగులు ఉండేలా విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. కొన్ని చోట్ల మాత్రం సిబ్బంది అలసత్వం ఉందని ఆరోపణలు వస్తున్నాయి. కారణంగా రాత్రి, పగలు తేడా లేకుండా వీధి దీపాలు నిరంతరం వెలుగులు ఇస్తున్నాయి. మండల కేంద్రంలోని షాదీఖానా పక్కనగల హైస్కూల్ ప్రహరీ వెంట వీధిలో ఏర్పాటు చేసిన వీధి దీపాలకు ఆఫ్, ఆన్ లేకపోవటంతో పగలే వెన్నెల అన్నట్లు అవి నిరంతరం వెలుగుతున్నాయి. దీంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి వృథా విద్యుత్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



కట్టంగూరులో ఆంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారి

కట్టంగూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ -12 కేంద్రాలను నకిరేకల్ ప్రాజెక్టు సీడీపీవో అశ్రు అంజుమ్‌తో కలిసి తనిఖీ చేశారు. వంట, స్టాక్ వివరాలు, పలు రికార్డులను పరిశీలించారు. వంట పాత్రలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ బిక్షమమ్మ, పద్మ ఉన్నారు.

నేడు పీఆర్‌టీయూటీఎస్ సర్వసభ్య సమావేశం

నల్లగొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూటీఎస్ జిల్లా సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీన సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని చినవెంకటరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు తిరందాసు సత్తయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌టీయూ భవనంలో మాజీ ఎమ్మెల్సీ, దివంగత బీరెల్లి ధర్మారెడ్డి విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్‌రెడ్డి, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్ హాజరవుతున్నారని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

చిట్యాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని తెలంగాణ మలిదశ ఉద్యమకారులు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా పారిశుధ్య కార్మికులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలు రోగాల బారిన పడకుండా చేస్తున్న పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవా లన్నారు. ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు.

సరైన మోతాదులో అయోడిన్ వాడాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వెంకటేశ్వర్లు

చిట్యాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సరైన మోతాదులో అయోడిన్ వాడాలని వైద్యాధికారి ఈసం వెంకటేశ్వర్లు తెలిపారు. అయోడిన్ డెఫిషీయన్సీ డే సందర్భంగా మంగళవారం చిట్యాల పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. అయోడిన్ తగ్గితే గాయిటర్ థైరాయిడ్ వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. అయోడిన్ మోతాదు తగ్గితే గర్భిణులు, పిల్లలకు వ్యాధులు వస్తాయన్నారు. అయోడిన్ కలిగిన ఉప్పుతో పాటు అయోడిన్ కలిగిన పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ, సిబ్బంది నాగరాణి, సుధాకర్ పాల్గొన్నారు.

పార్వతీదేవిగా ఎల్లమ్మతల్లి



కనగల్: మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం లో దీపావళి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం అమ్మ వారు భక్తులకు పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో అర్చక బృందం అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో అష్టోత్తర పూజలు జరిపి అమ్మవారికి సింహ హార తులిచ్చారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దీపావళి వెలుగులు



నల్లగొండలో..

నార్కట్‌పల్లిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

దీపావళి పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా సోమవారం జరుపుకున్నారు. లక్ష్మీ కటాక్షం కోసం మహాలక్ష్మి వ్రతాలు, కేదారేశ్వర వ్రతాలు నిర్వహించారు. బంధు మిత్రుల రాకతో పండుగ సందడి నెలకొంది. ప్రమిదలతో కూడిన వివిధ ఆకారాల్లో జ్యోతులను వెలిగించారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు దేవాలయాల్లోని అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు తమ ఇంటి ముందే పెద్ద సంఖ్యలో బాణాసంచా కాల్చారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



దీపాలు వెలిగిస్తున్న చిన్నారులు



మునుగోడులో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

చెర్వుగట్టులో ఘనంగా లక్ష పుష్పార్చన



చెర్వుగట్టులో లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నార్కట్‌పల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంపై మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన వేడుక ఘనంగా జరిగింది. కార్తీక మాసారంభానికి తోడు అమావాస్య తిథి సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత గర్భాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివన్నామ స్మరణల మధ్య మహా మంటపానికి చేర్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, ఉప ప్రధాన అర్చకుడు సతీశ్ శర్మ సహార్చకులు సురేశ్ శర్మ, శ్రీకాంత్ శర్మలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విశేష పుష్పాలతో ఉత్సవ మూర్తులను ఘనంగా అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలందుకున్న పుష్పాల కోసం భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరించి పార్వతీ జడల రామలింగేశ్వరునితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కింద ఉన్న పార్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

నూనె గింజల సాగుపై కేంద్రం నజర్

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. కిలో విత్తనానికి ఒక గ్రాము టెబ్యూకొనజోల్, రెండు డీఎస్ లేదా రైజోబియం కల్చర్ 200 గ్రాములు కలిపి విత్తనాలను శుద్ధిచేస్తే ఒక ఎకరాకు వినియోగించవచ్చని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా విత్తనాలు దూరంగా విత్తితే అందులో అంతర్ పంట కింద కంది, మొక్కజొన్న, జొన్న పంటలు సాగుచేయవచ్చు. విత్తే సమయంలో యూరియా 18 కిలోలు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 100కిలోలు, ఎంవోపీ 33 కిలోలు వేయాల్సి ఉంటుంది. విత్తిన 30 రోజుల తరువాత 10 నుంచి 15 కిలోలు అందిస్తే సరిపోతుందని అధికారులు సూచిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ఈ యాసంగిలో ఎనిమిది మండలాల్లో నూనె గింజల సాగు విజయవంతమైతే వచ్చే యాసంగి నాటికి పెద్ద మొత్తంలో ఎన్ఎంఈవో పథకాన్ని అమలులోకి తీసుకురానున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● నల్లగొండ ఆర్డీవో అశోక్

కట్టంగూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి అన్నారు. కట్టంగూరులోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, పాఠశాలలో భోజనాన్ని, వంటగదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, పాఠశాల ఎస్‌వో నీలాంబరీ, ఉపాధ్యాయునిలు ఉన్నారు.

చిత్తలూరుకు టీజీబ్యాంకు మంజూరు

శాలిగౌరారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తలూరు గ్రామానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఏర్పాటుకు మేనేజర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో బ్యాంక్ ఏర్పాటుకు అద్దెకు భవనం చూపిస్తే 15రోజుల్లో బ్యాంకును ప్రారంభిస్తామని జనరల్ మేనేజర్ తెలిపినట్లు తెలిపారు. ప్రస్తుతం చిత్తలూరు గ్రామ ప్రజలు తెల ంగాణ గ్రామీణ బ్యాంకు సేవలకు 14కిలోమీటర్ల దూరంలో పెర్కకొండారంలోని తెల ంగాణ గ్రామీణ బ్యాంకుకు రావాల్సి వస్తుంది. చిత్తలూరులో బ్యాంకు ఏర్పాటైతే చిత్తలూరుతో పాటు వంగమర్తి, అంబారిపేట, తుడిమిడి ప్రజలకు సేవలు అందనున్నాయి

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత హర్షణీయం



నార్కట్‌పల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు పోటీ చేయడానికి అనర్హతగా ఉన్న నిబంధనను ఎత్తివేస్తూ కేబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు సోమవారం నార్కట్‌పల్లిలో క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి బస్టాండ్ వద్ద క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, దార యాదయ్య, వాసుదేవ్, వేముల నర్సింహ్మ, రాధారపు బిక్షపతి, సిల్వేరు గిరి, ఇడుకుళ్ల బిక్షమయ్య, నల్ల సతీశ్, సర్వర్ అలీ పాల్గొన్నారు.

సామాజిక సేవ అభినందనీయం

నకిరేకల్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ లయన్స్‌క్లబ్ వారు ప్రతి రోజు సామాజిక కార్యక్రమాలు అన్నదానం కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తాటికల్ పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు అన్నారు. నకిరేకల్ చీమలగడ్డలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం లయన్స్‌క్లబ్ , నవ్యక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రీమీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులతో పాటు పేద వర్గాల వారికి అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, వృద్ధాశ్రమం ట్రస్ట్ చైర్మన్ ఎన్ రామ్మోహన్‌రావు, డీసీ యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, కార్యదర్శి సూర్యచందర్‌రావు, ఫ్రీమీల్స్ ఆన్ వీల్స్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఉప్పల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయసాధనకు కృషిచేయాలి

కట్టంగూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య గౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో కానిస్టేబుల్ చెవుగోని నాగరాజు విగ్రహానికి ఆయన మాజీ ప్రజాప్రతినిధులు కలిసి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెవుగోని నాగరాజు, బద్రి నారాయణ, కొమ్ముకోటి, ఇటుకుల గంగాధర్, సాయి, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.



కానిస్టేబుల్ నాగరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డీసీసీ ప్రచార కన్వీనర్‌గా శ్రావణిరెడ్డి



నార్కట్‌పల్లి, అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్‌గా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి గ్రామానికి చెందిన గోలి శ్రావణిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రచార కమిటీ జిల్లా చైర్మన్ పోలగోని వెంకటేశ్‌గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నుంచి శ్రావణిరెడ్డి నియామక పత్రం అందుకున్నారు. తన నియామకానికి కృషిచేసిన పార్టీ నాయకులకు శ్రావణిరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పవన్‌సాయి హాస్పిటల్ అధినేత శ్రీనివాస్‌కు మాతృవియోగం

శాలిగౌరారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలం తుడిమిడి గ్రామానికి చెందిన హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని పవన్‌సాయి హాస్పిటల్ అధినేత ఆలేటి శ్రీనివాస్ మాతృమూర్తి ఆలేటి లింగమ్మ(80) అనారోగ్యంతో మరణించింది. లింగమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం లింగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. లింగమ్మ మరణం కుటుంబానికి తీరని లోటన్నారు.



వివిధ పార్టీల నాయకులు, కుటుంబసభ్యులు లింగమ్మ మృతదేహంపై పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

శాలిగౌరారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలోనిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కడారి అంజయ్యను పలువురు కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, నాయకులు బెల్లి వీరభద్రం, పెరుమాండ్ల నరేష్, బొల్లికొండ గణేష్, దొంతూరి రామచంద్రు, బోడ విజయ్ కుమార్, నిమ్మల కృష్ణ, కుర్ర లింగయ్య, పడాల రమేష్, మంగదుడ్ల శ్రీనివాస్, బొడ్డు సోమలింగయ్య, కంది మహేష్, దేవరకొండ శంకర్, బొల్లికొండ సందీప్, చిల్లంశెట్టి సాయి గణేష్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 22 అక్టోబరు 2025


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.80 (305.9818)	52,579	52,579
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	1,767.22	1,767.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.653 (43.694)	30,743	37,715

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



వైభవంగా దీపావళి



నల్లగొండ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని సోమవారం జిల్లా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుకాణాలు, ఇళ్లలో లక్ష్మీ పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించారు. పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కీలక పాత్ర పోషిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలను రక్షించేందుకు ఎంతో మంది పోలీసులు అమరులయ్యారని, వారి త్యాగాలు మరువలేనివన్నారు. పోలీస్ అమరుల కుటుంబాలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో జిల్లాలో ఇప్పటి వరకు 15మంది అమరులయ్యారని పేర్కొన్నారు. సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు మల్లారెడ్డి, శివరాంరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాఘవరావు, రాము, మహాలక్ష్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, శ్రీనునాయక్, సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు సంతోష్, శ్రీను, హరిబాబు, సురప్పనాయుడు, నర్సింహ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజు, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ అమరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, తదితరులు

తాత్కాలిక పనులు చేసుకునే వారికి బీమా

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో తాత్కాలిక పనులు చేసుకుని జీవించే వారితో, వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు చేసుకునే వారందరితో జీవిత బీమా చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె తన ఛాంబర్‌లో మునిసిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. తాత్కాలికంగా పనులు చేసుకుని జీవించే వారికి బ్యాంకుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయన్నారు. అందుకు ఏడాదికి రూ.20 ప్రీమియంగా చెల్లిస్తే సరిపోతుందన్నారు.

'ఆది కర్మయోగి' పథకం అమలులో జిల్లాకు గుర్తింపు

ఆది కర్మయోగి పథకం అమలులో జిల్లాకు ఉత్తమ ప్రదర్శన విభాగం కింద గుర్తింపు లభించడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్‌ను ఆమె అభినందించారు.



నూనె గింజల సాగుపై కేంద్రం నజర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ పంట నూనెల మిషన్ నల్లగొండ జిల్లాలో అమలుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్‌ఎంఈవో (నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్) పథకాన్ని వచ్చే యాసంగి నుంచి అమలు చేయనున్నారు. అందుకు నల్లగొండ జిల్లాలో ఎనిమిది మండలాలను ఎంపిక చేశారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- ఎన్‌ఎంఈవో పంటల మిషన్ అమలు
- యాసంగిలో నల్లగొండ జిల్లాలో 8 మండలాలకు వేరుశనగ విత్తనాలు
- నూరుశాతం సబ్సిడీపై పంపిణీ
- సాగుకు సమాయాత్తం చేస్తున్న వ్యవసాయశాఖ

దేశంలో వంట నూనెల ఉత్పత్తులు తగ్గుతుండటంతో నూనె గింజల సాగుపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. నూనె గింజలను ఉత్పత్తి చేయడంతోపాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా వీటి సాగును పెంచాలని లక్ష్యంగా నిర్ణయించింది. అందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలను ఎంపిక చేసింది. అందులో భాగంగా నల్లగొండ జిల్లాలో 2,224.44 హెక్టార్ల లో వేరుశనగ సాగును ప్రోత్సహించనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూ పొందించి అందుకు అనుగుణంగా విత్తనాలను పంపిణీ చేయనుంది. ఈ మేరకు జిల్లాలో వం ట నూనె ఉత్పత్తుల సాగును పెంచేందుకు వ్య వసాయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

8మండలాల్లో ఎన్‌ఎంఈవో పథకం

జాతీయ వంట నూనెల మిషన్ పథకాన్ని ఈ ఏడాది నల్లగొండ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో అమలుచేయనున్నారు. దేవరకొండ, చందంపేట, డిండి, నేరేడుగొమ్ము, పీఏపల్లి, తిరుమలగిరి(సాగ ర్), మునుగోడు, కట్టంగూరు మండలాల్లో వచ్చే యాసంగి సీజన్ నుంచి అమలు చేయనున్నారు. నూనె గింజల ఉత్పత్తితో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడ మే లక్ష్యంగా కేంద్రం జాతీయ వంట నూనెల మిషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎన్‌ఎంఈవో పథకం కింద 2,224.44 హెక్టార్లలో నూనె గింజల పంటలు సాగుచేయనున్నారు. అందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కేంద్రం నూరుశాతం సబ్సిడీ కింద 5,004.99 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ఎంపిక చేసిన మండలాలకు సరఫరా చేసింది. అర్హులైన రైతులందరికీ వేరుశనగ విత్తనాలను నూరుశాతం సబ్సిడీతో అందించనున్నారు. వేరుశనగ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ఉచితంగా ఇవ్వనుండటంతో ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ఈ ఏడాది ఎంపిక చేసిన మండలాల్లో ఈ పథకాన్ని అమలుచేస్తుండగా, వచ్చే సీజన్ నాటికి మరింత విస్తరించే అవకాశం ఉంది.

విత్తనాలు, ఎరువుల మోతాదు ఇలా..

యాసంగిలో వేరుశనగ విత్తనాలతో పాటు విత్తన శుద్ధి, ఎరువుల మోతాదు వివరాలపై .

- మిగతా 8వ పేజీలో...

వేరుశనగ సాగుకు ప్రోత్సాహం



కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఈవో పథకాన్ని అమలు చేయడం కోసం వేరుశనగ విత్తనాలను నూరుశాతం సబ్సిడీపై అందజేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళికను ఎనిమిది మండలాల్లో అమలు చేస్తున్నాం. రైతులు దృష్టి సారించి విత్తన సాగు ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలి. ఏటా నూనె గింజల సాగును పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వేరుశనగ సాగును ప్రోత్సహిస్తోంది. రైతులు ఈ క్రమంలో వేరుశనగ సాగుపై దృష్టి సారించాలి.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

నూనె గింజలు సాగు చేసే మండలాల ఇలా..

మండలం	హెక్టార్లు	విత్తనాలు (క్వింటాళ్లలో)
దేవరకొండ	500	1,125
చందంపేట	500	1,125
డిండి	474.44	1,067.49
నేరడుగొమ్ము	500	1,125
పీఏపల్లి	50	112.5
తిరుమలగిరి(సాగర్)	80	180
మునుగోడు	40	90
కట్టంగూరు	80	180

కొనుగోళ్లు సజావుగా జరిగేలా కమిటీ

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

చిట్యాలరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్రాంపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాటాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించడంలో రైతులకు ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్, మండల వ్య వసాయ అధికారి, నాయబ్ తహసీల్దార్ (సివిల్‌సప్లయ్)తో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు లేకుండా పరిష్కరిస్తుందన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, తేమ శాతం 17వరకు ఉండేలా చూడాలన్నారు. తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. 17శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతుధరను పొందాలన్నారు. వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాశులపై టార్పాలీన్లు కప్పి ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఈవోఓ వీణకుమారి, దంటిక రాజమల్లు, తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్

తేమ లేకుండా తీసుకురావాలి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



తొండ్లాయి కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యంలో తేమ శాతం లేకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని నెమ్మాని, తొండ్లాయి, బాజకుంట, బెండల్‌పహాడ్, అక్కెనపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కొందరు రైతులు పొలం నుంచి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. తేమ శాతం వచ్చేంతవరకు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కాగా, ఆయా కేంద్రాల్లో రికార్డుల నిర్వహణను పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం జీడికల్లు, సీసీలు శ్రీనివాసులు, నర్సింహ, శంకర్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో నేడు ప్లేస్మెంట్ డ్రైవ్

నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్, ఫ్రాంక్లిన్ టెక్ ఆధ్వర్యంలో బుధవారం ఎంజీయూలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు డైరెక్టర్ డాక్టర్ వై.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఐటీ, నాన్ ఐటీ సంస్థలు పాల్గొంటాయని, ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో పాల్గొనే అభ్యర్థులు డిగ్రీ, పీజీ, బీటెక్ పూర్తయి ఉండాలని, అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 9010203857లో సంప్రదించాలని కోరారు.



కార్తీక మాసం..

సకల శుభం

7

అధిక వడ్డీకి ఆశపడి మోసపోవద్దు

గుర్రంపోడ్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీకి ఆశపడి ప్రజలు మోసపోవద్దని గుర్రంపోడ్ ఎస్ఐ పసుపులేటి మధు అన్నారు. మంగళవారం గుర్రంపోడులో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వం రిజిస్టర్ కాని చిట్టీలను నడుపుతూ, డిజిటల్ కరెన్సీ ట్రేడింగ్ పేర్లతో కొందరు మోసగాళ్లు అమాయక ప్రజలకు అత్యాశ చూపించి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసాలకు లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

గ్రామపంచాయతీ కార్మికుడి మృతి

నేరేడుగొమ్ము, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుడు దూళ్ల బాలయ్య(45) మంగళవారం ఇంటి నుంచి విధులకు వెళ్లే క్రమంలో ఆకస్మికంగా మృతి చెందాడు. 2022 నుంచి బాలయ్య పంచాయతీ కార్మికుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. బాలయ్య మృతి చెందడంతో గ్రామానికి చెందిన పలువురు సంతాపం తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దేవరకొండలో వర్షం


దేవరకొండలో కురుస్తున్న వర్షం

దేవరకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో మంగళవారం సాయంత్రం నుంచి ముసురుతో కూడిన వర్షం కురిసింది. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ఉందని వాతావరణ శాఖ తెలుపుతుండడంతో పత్తి రైతులు పత్తి తడుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరకొండ డివిజన్‌లోని చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, చింతపల్లి, పీఏపల్లి, గుడిపల్లి మండలాలలోని రైతులు ఈ సీజన్‌లో లక్ష 70వేల ఎకరాలవరకు పత్తి పంటను సాగు చేశారు. పత్తి పంట చేతికొచ్చింది. కొంత మంది రైతులు పత్తిని తీసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలోనే తుపాన్‌తో కూడిన వర్షం కురుస్తుండడంతో పత్తి తడిసి ధర తగ్గుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాల్‌కు రూ.8వేలకు పైగా మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

నాంపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200మంది వద్ధులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ మంగళవారం తెలిపారు. నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేదలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తల్లోజు ప్రవీణచారి, పానగంటి మహేష్, నరేష్, సహదేవ్, బోసు తదితరులు పాల్గొన్నారు.


బియ్యం పంపిణీ చేస్తున్న ఈఎల్‌వీ ఫౌండేషన్ సభ్యులు

మిషన్‌భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

దేవరకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డిండి మండలంలోని కందుకూరు వాగులో వరద ఉధృతితో వాగులో ఉన్న మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లు మరమ్మతులకు గురయ్యాయి. 30రోజులుగా చందంపేట, డిండి మండలాలలోని 90 గ్రామాలకు మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. కాగా స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో మిషన్‌భగీరథ అధికారులు మరమ్మతులు చేశారు. కందుకూరు వాగులో ఊడిన పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేశారు. వరద ఉధృతి తగ్గడంతో మరమ్మతు పనులు చేపట్టారు. దీపావళి రోజున మిషన్ భగీరథ నీటిని చందంపేట, డిండి మండలాలలోని గ్రామాలకు యధావిధిగా సరఫరా చేసినట్లు దేవరకొండ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నగేష్ తెలిపారు. ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా భగీరథ నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

గుర్రంపోడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే అధికారులు ప్రారంభించాలని సీపీఐ మండల కార్యదర్శి రేపాక లక్ష్మీపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో వరికోతలు మొదలై 20రోజులు కావొస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గ్రామాల్లో రైతులు ధాన్యం ఆరబెట్టి కుప్పలు పోస్తున్నారని తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

సాగర్‌లో క్షుద్ర పూజల కలకలం

నాగార్జునసాగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో క్షుద్ర పూజల కలకలం రేపాయి. సోమవారం దీపావళి పండుగ తర్వాత అర్ధరాత్రి అమావాస్య ఉండడంతో పైలాన్‌కాలనీలో బస్టాండ్ దగ్గర సీ టైపు క్వార్టర్‌లల్లో ఓ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజుల చేశారు. ఉదయం నిద్ర లేచిన ఇంటి యజమాని భయందోళన చెంది ఇంటి నుంచి బయటకు వచ్చాడు. విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలిపారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మూఢ నమ్మకాలను నమ్మవద్దని మంత్రాలకు చింతకాయలు రాలవని ప్రజలు ఎవరు భయాందోళన చెందవద్దని తెలిపారు.

నేటి నుంచి మహాన్నదానం


సమావేశంలో మాట్లాడుతున్న ముక్కపాటి వెంకటేశ్వరరావు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అన్నదాన కార్యక్రమం నేడు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముక్కపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా నేడే ప్రారంభించే అన్నదాన కార్యక్రమం మండల కాలం పాటు కొనసాగుతుందన్నారు. అయ్యప్ప, ఆంజనేయ, శివ, భవానీ మాలాధారణ చేసే భక్తులకు అందించే మహోత్తర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో పులిమేడు ఆశ్రమ గురూజీ దేశిడి శేఖర్‌రెడ్డి, గుడిపాటి నవీన్, జానకిరాంరెడ్డి, నాయుడు, గురువారెడ్డి, బాలునాయక్ పాల్గొన్నారు.

నూనె గింజల సాగుపై
కేంద్రం నజర్

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. కిలో విత్తనానికి ఒక గ్రాము టెబ్యూకొనజోల్, రెండు డీఎస్ లేదా రైజోబియం కల్చర్ 200 గ్రాములు కలిపి విత్తనాలను శుద్ధిచేస్తే ఒక ఎకరాకు వినియోగించవచ్చని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా విత్తనాలు దూరంగా విత్తితే అందులో అంతర్ పంట కింద కంది, మొక్కజొన్న, జొన్న పంటలు సాగుచేయవచ్చు. విత్తే సమయంలో యూరియా 18 కిలోలు, సింగల్ సూపర్ ఫాస్ఫేట్ 100కిలోలు, ఎంవోపీ 33 కిలోలు వేయాల్సి ఉంటుంది. విత్తిన 30 రోజుల తరువాత 10 నుంచి 15 కిలోలు అందిస్తే సరిపోతుందని అధికారులు సూచిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ఈ యాసంగిలో ఎనిమిది మండలాల్లో నూనె గింజల సాగు విజయవంతమైతే వచ్చే యాసంగి నాటికి పెద్ద మొత్తంలో ఎస్ఎంఈవో పథకాన్ని అమలులోకి తీసుకురానున్నారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం



- ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు
- కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్న రైతులు
- తరచుగా కురుస్తున్న భారీ వర్షాలు
- రైతుల కష్టం నీటిపాలు

ఊట్కూరులో ఐకేపీ కేంద్రంలో కురుస్తున్న వర్షం

నిడమనూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అన్నదాతలు సాగు చేసిన పంటలు కురుస్తున్న వర్షాలకు నీటిపాలవుతున్నాయి. మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. వివిధ గ్రామాల్లో ముందుగా సాగు చేసిన పొలాలు కోయడంతో ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోశారు. నిడమనూరు మార్కెట్ యార్డుతో పాటు ఊట్కూరు ఐకేపీ కేంద్రాల్లో రెండు వారాలుగా ధాన్యాన్ని రాశులుగా పోశారు. ధాన్యం రాశులపై కొందరు రైతులు పట్టాలు కప్పినా కేంద్రాల్లో పట్టాలు సరిపడా లేకపోవడంతో అందరు రైతులు పట్టాలు కప్పలేదు. కానీ మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు కేంద్రాల్లో కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఊహించని విధంగా మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా భారీగా వర్షం కురియడంతో కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొంత ధాన్యం వరద నీటికి కొట్టుకుపోయిందని రైతులు వాపోతున్నారు. పక్క మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ నిడమనూరు మండలంలో ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇటీవల తరచుగా భారీగా వర్షాలు కురిసి ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే విషయం గురించి కూడా ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని రైతులు అంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కూడా రైతులకు సరైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతితో పాటు ప్రభుత్వం కూడా రైతులపై కరుణ చూపడం లేదని అంటున్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్నందున వెంటనే కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని, అదే విధంగా అధికారులు మిల్లర్లతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



రెండు వారాలు అవుతోంది



సాగు చేసిన ఐదెకరాల పొలం కోసి 200 బస్తాల ధాన్యాన్ని ఊట్కూరు ఐకేపీ కేంద్రంలో పోశాను. కొనుగోళ్ల కోసం రెండు వారాలుగా ఎదురుచూస్తున్నాను. ఈరోజు కురిన వర్షానికి ధాన్యం తడిసింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కేంద్రాలు సత్వరమే ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి.

నర్సింగు కృష్ణయ్య, ఊట్కూరు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి


దేవరకొండలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు


నిడమనూరులో శ్రద్ధాంజలి ఘటిస్తున్న పోలీసులు

దేవరకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో అమరులైన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. మంగళవారం స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. పోలీసుల త్యాగాలు మరువలేనివని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా విధి నిర్వాహణలో అసులుబాసిన పోలీసులను స్మరిస్తూ ఈనెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, ఉమ మహేశ్వర్, రాపోలు నిరంజన్, శ్రీనయ్య, గోపి, భాస్కర్‌రెడ్డి, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిడమనూరు: పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదని ఎస్ఐ ఉప్పు సురేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిడమనూరుకు చెందిన పోలీసు అమరవీరుడు ఉన్నం చెన్నకేశవులు చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రల పరిరక్షణకు విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలను కొనియాడారు. అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఉన్నం ఈశ్వర్, కొండోజు కృష్ణాచారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధవనంలో ఘనంగా దమ్మ దీపోత్సవం

నాగార్జునసాగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్ కాలనీ లో మంగళవారం దమ్మ దీపోత్సవాన్ని ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగ్‌పూర్‌కు చెందిన బౌద్ధ వ్యాపారవేత్తల సంఘం చైర్మన్ రత్నదీప్ కాంబ్లీ హాజరయ్యారు. ఎంట్రన్స్ ప్లాజా వద్ద మొదటి దీపం వెలిగించి దమ్మ దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఎంట్రన్స్ ప్లాజా నుంచి వందలాది బౌద్ధ మతస్తులు దీపాయాత్ర చేస్తూ మహాస్థూపం వరకు యాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి చెడులను విశ్లేషించి మంచిని మాత్రమే స్వీక రించే నైతికతను జీవన విధానంగా బోధించిన బుద్ధుని మార్గం అనుచరణీయమన్నారు. బుద్ధవనం అంతర్జాతీ యంగా ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా మారుతుందన్నారు. అనంతరం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ దమ్మ దీపోత్సవ నేపథ్యాన్ని వివరించారు. ప్రతి దీపావళి అమవాస్య రోజున దమ్మ దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. సిద్ధార్థుడు జ్ఞానోదయం పొంది మొదటి సారీగా కలిసి నగరానికి వస్తున్న సందర్భంగా అక్కడి ప్రజలు జ్ఞాన జ్యోతులను వెలిగించి బుద్ధునికి ఘనంగా స్వాగతం పలుకుతారన్నారు. కార్యక్రమంలో బుద్ధవనం ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, శ్యాంసుందర్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


బుద్ధవనంలో దమ్మ దీపోత్సవంలో పాల్గొన్న బౌద్ధ మతస్థులు


దీప కాంతులు


చింతపల్లి : వెంకటేశ్వరనగర్‌లో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

అంతటా దీపావళి వెలుగులు

దీపావళి పండుగను ప్రజలు ఘనంగా సోమవారం జరుపుకున్నారు. లక్ష్మీ కటాక్షం కోసం మహాలక్ష్మి వ్రతాలు, కేదారేశ్వర వ్రతాలు నిర్వహించారు. బంధుమిత్రుల రాకతో పండుగ సందడి నెలకొంది. దేవాలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు సాయంత్రం ప్రమిదలతో దీపాలను వెలిగించి దీపాల పండుగను వైభవంగా జరిపారు. దేవాలయాల్లో విద్యుత్ దీపాలతో పాటు ప్రమిదలతో జ్యోతులను వెలిగించారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు దేవాలయాల్లోని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


కొండమల్లేపల్లిలో బాణాసంచా కాల్చుతున్న కుటుంబం


బుద్ధవనంలో దమ్మ దీపోత్సవంలో పాల్గొన్న మల్లేపల్లి లక్ష్మయ్య

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు


గ్రూప్-2 ర్యాంకర్ నాగరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిభకు పేదరికం అడ్డుకాదని కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధింవచ్చని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామానికి చెందిన ఇరుగంటి చినమట్టయ్య లింగమ్మ దంపతుల కుమారుడు నాగరాజు ఇటీవల జరిగిన గ్రూప్-2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపీవో ఉద్యోగాన్ని పొందిన సందర్భంగా సోమవారంఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని నాగరాజును శాలువాతో సన్మానించారు. చదువుకు పేదరికం అడ్డు కాదని నాగరాజు నిరూపించాడన్నారు. పేద కుటుంబం నుంచి ఉద్యోగం పొందిన వారందరూ బాధ్యతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పేదల పక్షాన నిలబడి సేవలు అందించాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి గ్రామస్థులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మిర్యాలగూడ మండలంలోని ధీరావత్‌తండా గ్రామానికి చెందిన ధీరావత్ బగ్గునాయక్ గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకొని బగ్గునాయక్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు ధీరావత్ వెంకట్రామ్‌నాయక్, మాలోతు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జర్నలిస్టు మృతి


పెద్దఅడిశర్లపల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పీఏపల్లి మండలకేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బుయ్య శివనాగరాజు(45) మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత వారం రోజులుగా హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన మంగ ళవారం మృతి చెందాడు. ఆయన గత 20 సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో పని చేస్తూ ఎంతో మంది పాత్రికేయులకు మార్గదర్శకుడిగా నిలిచాడు. దీంతో తోటి పత్రిక విలేకర్లు , దేవరకొండ డివిజన్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(ఐజేయు) అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. శివనాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


వింజమూర్ పల్లె దవాఖానాలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలోని వింజమూర్ పల్లెదవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకుని మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సమయ పాలన పాటిస్తూ వైద్య సేవల కల్పన కోసం దృష్టి సారించాలన్నారు. హైరిస్క్ కేసుల దస్త్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస. రవి, కల్యాణ్ చక్రవర్తి, మండల వైద్యాధికారి శ్రీదేవి, సిబ్బంది అమీనా యస్మీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కారు మబ్బులు కమ్మగా...


మిర్యాలగూడలో మంగళవారం కురిసిన వర్షంతో పట్టణం తడిసి ముద్దయింది. దీంతో కాలనీలన్నీ జలమయమయ్యాయి. వర్షానికి ముందు దట్టమైన మబ్బులు కన్పించాయి. పట్టణ ప్రజలు ఆహ్లాదకరమైన అనుభూతిని ఆస్వాదించారు. ● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్